క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వీవీ నరసరాజు రోడ్డులోని శ్రీ కృష్ణ దేవాలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి 16వ శ్రీ కృష్ణ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ బుధవారం శ్రీలక్ష్మీ గణపతి సమేత అష్టలక్ష్మీ కుబేర హోమం, 7వ తేదీ గురువారం స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్ర తులసీ దళ అర్చన జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు ఉట్టికొట్టు కార్యక్రమం సాయంత్రం పల్లకీ సేవ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రిటైనింగ్‌వాల్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ బుడమేరు మధ్య కట్టలో ప్రమాదకరంగా మారిన రిటైనింగ్‌వాల్ పునర్నిర్మాణం పనులకు సోమవారం కార్పొరేటర్ బీహెచ్ ఎస్‌వీ జానారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ ప్రమాదకరంగా మారటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీంతో తాను సమస్యను ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి రూ. 1.60 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గారావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హోండా ఎలివేట్ కారు మార్కెట్‌లోకి విడుదల



కృష్ణలంక(విజయవాడతూర్పు): హోండా కార్స్ తన సరికొత్త హోండా ఎలివేట్ కారును విజయవాడ మార్కెట్‌లోకి సోమవారం విడుదల చేసింది. ఎంజీ రోడ్డులోని సుందరం హోండా కారు షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్టీవో పి.ప్రవీణ్, ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ పాల్గొని లాంఛనంగా కారును విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ హెడ్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. హోండా సంస్థ తొలిసారిగా మిడిసైడ్ సువ్ మోడల్ విత్ మోస్ట్ లగ్జిరియస్ ఫీచర్స్‌తో అందుబాటులో తీసుకువచ్చామన్నారు. గ్రౌండ్ క్లియరెన్స్, బూట్ స్పేస్, ఫ్రంట్ బోల్డ్ అండ్ స్టైలిష్ గ్రిల్, లెగ్ రూం స్పేస్, లెవల్ 2, ఆడాస్ ఫీచర్స్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన టీచర్స్ డే పురస్కరించుకుని జక్కంపూడి పాఠశాలకు పది కుర్చీలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్టీలు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మ మాట్లాడుతూ ఇక్కడ తమకు కుర్చీలు అవసరం గుర్తించి అందజేసిన ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు సమాజసేవలో భాగస్వాములు కావాలని సినీ దర్శకుడు, సీనియర్ గాయకుడు ఒమ్మి రమాశంకర్ అన్నారు. మురుగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ఉప్పొంగెలే గోదావరి పేరుతో సినీ సంగీత విభావరి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రమాశంకర్ మాట్లాడుతూ సమాజాన్ని దేవాలయంగా భావించి అన్నార్తులకు సేవలను అందించాలని సూచించారు. రూపాశ్రీ, కృష్ణకుమారి, ఆదిరాల జయప్రభ, రాజేష్, నాయక్ పలు హిందీ తెలుగు చిత్రాలతోపాటు భక్తి గీతాలను మధురంగా ఆలపించారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- విద్యుత్ డీఈ కార్యాలయ భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా రాష్ట్ర ప్రజలకు అందించడమే లక్ష్యంగా విద్యుత్ రంగంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. అజిత్ సింగ్‌నగర్లో రూ.42 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏపీసీపీడీసీఎల్) డీ-4 కార్యాలయ భవనాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సీఎండీ జె.పద్మజనార్దన్ రెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారంలో విద్యుత్ శాఖ ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. ఒక్క గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోనే పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు అమర్చినట్లు వెల్లడించారు. నూతనంగా నిర్మించుకున్న ఈ కార్యాలయం ద్వారా 1,11,266 మంది విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్కడ చూసినా ఓల్టేజీ డ్రాప్‌లతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తుచేశారు. సీఎండీ జె.పద్మజనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో మల్లాది విష్ణు చూపే శ్రద్ధ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన అన్న ఒక్కమాటతో డి-4 సబ్ డివిజన్ ఏర్పాటు అయినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ శాఖకు సంబంధించి నియోజకవర్గంలో రూ. 40.12 కోట్ల పనులు జరిగినట్లు తెలియజేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డైరెక్టర్ డి.జయభారత్ రావు, ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఈ బి.వి.సుధాకర్, ఏడీఈ టి.రవిచంద్ర, ఏఈలు, విద్యుత్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యం
- మేయర్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 300 పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల వాతావరణం కలుషితం అవ్వటమే కాకుండా పారిశుద్ధ్య నిర్వహణకు తీవ్ర అవరోధం కల్పిస్తోందన్నారు. ప్లాస్టిక్ సంచుల ద్వారా చెత్త, వ్యర్థాలను డ్రెయిన్లలో వేయరాదని చెప్పారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ జ్యూట్, పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో విజయవాడ నగరాన్ని మొదటి ర్యాంక్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ నివారించి పర్యావరణాన్ని కాపాడటంలో భాగస్వాములై, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో 24 అర్జీల స్వీకరణ



అర్జీ స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): డివిజన్ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆమె నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా, సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన స్పందనలో మొత్తం 24 సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారన్నారు. అందులో పట్టణ ప్రణాళిక విభాగం - 12, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం(పీవో యూసీడీ)- 5, ఇంజినీరింగ్ విభాగం - 4, రెవెన్యూ - 2, పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి ఒక్క అర్జీ వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, సీఈ ప్రభాకర్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లతా, బయాలజిస్ట్ సూర్యనాయక్, మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానంకు దాత కాకరపర్తి వెంకట సుబ్బారావు, వారి కుమారులు ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి కేవీఎల్ హరినాథ్, కేవీ రామకృష్ణ రూ. లక్ష 116 విరాళం మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో మందిరం ఆంధ్రా షిరిడీగా తీర్చిదిద్దామని తెలిపారు. షిరిడీకు వెళ్లి మొక్కులు తీర్చుకోలేని వారు ఇక్కడకు వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటున్నారని చెప్పారు. భక్తులు, దాతల మనోభావాలకు అనుగుణంగా తాము షిరిడీ తరహాలో ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దాత కాకరపర్తి వెంకట సుబ్బారావు, ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి కేవీఎల్ హరినాథ్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములం కావాలనే ఉద్దేశంతో విరాళం అందించామని తెలిపారు. మందిర అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు జయలక్ష్మి, రామానుజరావు, పద్మజ, మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కమిటీ సభ్యులు యాదల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● శ్రమైక జీవనం



పెద్దపులిపాక వద్ద సిమెంట్ బట్టీలో ప్రతి రోజు కార్మికులు పెద్ద సంఖ్యలో రాళ్లను తయారు చేస్తారు. బట్టీలో రాళ్లను తరలిస్తున్న కార్మికుల చిత్రమిది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోడి పందేలు నిర్వహించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులపై నున్న పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్.మస్తాన్ అలియాస్ రాజు, మర్రెడ్డి రామకృష్ణారెడ్డిని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ప్రశ్నించారు. కోడి పందేలు నిర్వహణకు వచ్చినట్లు తెలిపారు. దీంతో ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి బైండోవర్ చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక కాలనీకి చెందిన మహిళ కనిపించడంలేదని నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కండ్రిక కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద భర్త నాగార్జున, అత్తతో ఉంటున్న తనుకుల నాగజ్యోతి ఈ నెల 3వ తేదీన పుట్టింటికని చెప్పి బంటుమిల్లి వెళ్లింది. భర్త ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. నాగజ్యోతి అన్నయ్యను విచారించగా ఇక్కడకు రాలేదని చెప్పాడు. అత్త నాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మూడేళ్ల కుమారుడితో తల్లి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మూడేళ్ల కుమారుడితో సహ తల్లి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...విద్యాధరపురం సితార కన్వెన్షన్ సెంటర్‌కు చెందిన షేక్ బాజీ నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు వెన్నెముక సమస్య ఉండడంతో అతనిని వైద్యుల వద్ద చూపిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో బాజీ తన కుమారుడు గౌతంతో కలిసి తల్లిగారింటి వద్దనే ఉంటుంది. తన కుమారుడుని ఆసుపత్రిలో సరిగా చూపించడం లేదని ఈనెల 2వ తేదీ ఉదయం బాజీ పుట్టింటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై బాజీ తల్లి షేక్ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

పెనమలూరు: కారు తీసుకుని మోసం చేసిన భార్యాభర్తలపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌లో నివసించే తెల్రప్రోలు శ్రీనివాస్‌కు విజయవాడ ఎస్‌ఆర్‌పేటలో జూమ్ కార్ సేల్స్ ఇండ్ సర్వీసెస్ యజమాని అల్లూరి శరత్‌చంద్రవర్మ, అతని భార్య జ్యోత్స్నప్రియతో పరిచయం ఉంది. శ్రీనివాస్ గత ఏడాది తన పాతకారును వారి ద్వారా విక్రయించాడు. వారి వద్ద మరో కారు కొన్నాడు. కొన్న కారుపై ఫైనాన్స్ తీసుకున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో అల్లూరి శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్న ప్రియ పెనమలూరు వచ్చి చిన్నపని ఉందని శ్రీనివాస్ కొన్న కారును తీసుకెళ్లారు. ఆ తరువాత కారు తీసుకొచ్చి అప్పగించలేదు. అప్పటి నుంచి భార్యాభర్తలు కనిపించకుండా తిరుగుతున్నారని, తన కారు తీసుకుని మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోసం చేసిన భార్యాభర్తలపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



ఫ్రీజర్‌బాక్స్ అందజేస్తున్న దాతలు

హనుమాన్‌జంక్షన్(గన్నవరం): నిజమైన సేవకు మానవత స్వచ్ఛంద సంస్థ నిదర్శనమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పొట్లూరి సీతారాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మానవతా స్వచ్ఛంద సంస్థకు రూ.70 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను తన తల్లిదండ్రులు పొట్లూరి జగన్‌మోహన్‌రావు, రత్నమాణిక్యం జ్ఞాపకార్థం సీతారాంప్రసాద్ అదజేశారు. మానవత సంస్థ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. గుడివాడలోని మానవత సంస్థకు కూడా మరో ఫ్రీజర్‌బాక్స్‌ను అందజేస్తామని ప్రకటించారు. పొట్లూరి పవనకుమార్, చలసాని సతీష్, సంస్థ చైర్మన్ మారుబోయిన కోటీశ్వరరావు, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, ఉపాధ్యక్షుడు దయాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఒక ట్రెండ్ సెట్టర్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సుపరిపాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఒక ట్రెండ్ సెట్ చేశారని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ 279వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉడా కాలనీ, ఈడబ్ల్యూఎస్ కాలనీ, ఎల్ఐజీ కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. 120 గడపలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ డివిజన్‌ని అవినీతికి కేరాఫ్‌గా నిలిపితే, ఈ ప్రభుత్వం అభివృద్ధిలో మేటిగా నిలిపిందని తెలిపారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏ విధంగా పనిచేయాలో ఆచరణలో చూపడంతో పాటు, అభివృద్ధి, సంక్షేమాన్ని ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేసిందన్నారు. ముఖ్యంగా పార్కుల అభివృద్ధితో డివిజన్ ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించుకుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఓపెన్ జిమ్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

బాబు స్లోగన్స్ విని ప్రజలు నవ్వుకుంటున్నారు..

పేదల భవిష్యత్ గురించి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇస్తున్న స్లోగన్స్ విని రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోఉన్నంత కాలం వందిమాగదులు, బడాబాబుల ఆస్తులకు ష్యూరిటీ ఇవ్వడం తప్ప, పేదలకు భవిష్యత్తు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల బాబు అనుభవం అన్నదాతలకు గానీ, యువత ఉద్యోగాలకు గానీ, మహిళల ఆర్థికాభ్యున్నతికి ఏ మాత్రం ఉపయోగపడలేదని విమర్శించారు. కేవలం వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. బాబు చేసిన పాపాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు బయట పడుతున్నాయని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో మరోలా, అధికారం కోసం ఇంకోలా మాట్లాడటం చంద్రబాబుకు అలవాటేనని మండిపడ్డారు. బాబు మాటలు విని మరోసారి మోసపోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. ఓటమి భయం చంద్రబాబు మాటల్లో స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఆయన తాపత్రయమంతా పూర్తిగా నమ్మకం కోల్పోయిన టీడీపీ కార్యకర్తలను కాపాడుకొనేందుకేనని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సిహెచ్.రవి, టిక్కం కృష్ణ, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభించిన కోస్టల్ బ్యాంక్ సీజీఎం రామన్, బ్యాంక్ అధికారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్నామని కోస్టల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) కేఏవీ. రామన్ తెలిపారు. గాయత్రీనగర్ ప్రధాన రహదారిలోని కోస్టల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం దగ్గర ఈ రథాన్ని రామన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ చైతన్య రథం తమ బ్యాంకు శాఖల వద్ద, జనాల రద్దీ ప్రాంతాల్లో బ్యాంక్ పథకాలపై ప్రచార కార్యక్రమాలపై వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోందన్నారు. వార్షిక ప్రీమియం రూ.436లు చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.2 లక్షల వరకు జీవిత బీమా లభిస్తుందని చెప్పారు. బ్యాంక్ ఖాతాదారులకు ఎంతో సౌలభ్యంగా ఉండే డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలను సురక్షితంగా, సులభంగా ఎలా నిర్వహించుకోవచ్చు అనే అంశాలపై కూడా ప్రచారం నిర్వహిస్తారన్నారు. మహిళలకు డిపాజిట్లపై అత్యధికంగా 8.5 శాతం వడ్డీని అందజేస్తున్నామని రామన్ చెప్పారు. కోస్టల్ బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్ ఆగ్రావాలాతో పాటుగా బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కల నిజం చేసిన గొప్ప సీఎం జగనన్న

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- న్యూఆర్‌ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ మేళా ప్రారంభం



లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, చిత్రంలో కార్పొరేటర్ దేవి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దశాబ్దాలుగా నిరుపేదలు ఎదుర్కొంటున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం లభించిందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. న్యూరాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీలలో సోమవారం ఏర్పాటుచేసిన ఇళ్ల రిజిస్ట్రేషన్ మేళా క్యాంపులను 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాల పై నుంచి ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం న్యూఆర్‌ఆర్‌పేట, వాంబేకాలనీ ప్రాంతాల్లోని ప్రజానీకం ఎదురుచూస్తుందని చెప్పారు. ఏ ప్రభుత్వం పట్టించుకోని వీరి గోడును మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సుతో పరిష్కార మార్గం చూపారన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వల్ల లబ్ధిదారుల కుటుంబాలు ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ప్రధానంగా తమ పిల్లల ఉన్నత చదువులు, వివాహాల సమయాల్లో వీటి ద్వారా బ్యాంకు లోన్లు తీసుకొని సమస్యలను అధిగమించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లను ఎలాట్ పొందినవారు, ఎలాట్ మెంట్ పొంది 10 సంవత్సరాల తర్వాత కొనుగోలు చేసిన నాన్ ఎలాట్ దారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ఒరిజినల్ ఎలాట్ మెంట్ పట్టా, నాన్ ఎలాట్ మెంట్ దారులైతే వారి పేరుతో ఒరిజినల్ విక్రయ డాక్యుమెంట్ (లింక్ తో సహా), నోటరీ అఫడవిట్, ప్రస్తుతం చెల్లిస్తున్న నీటి, ఇంటి పన్నుల రశీదులు, ఆధార్ కార్డు నకలు, ఇద్దరు సాక్షుల ఆధార్ కార్డు నకలు తీసుకుని రావాలని సూచించారు. వారం రోజుల పాటు జరిగే ఈ క్యాంపులను లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాళ్ల ఆదినారాయణ, బాల, పఠాన్ నజీర్ ఖాన్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మౌలాలి, ప్రేమ్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

టికెట్ చెకింగ్ సిబ్బందికి గుండె పరీక్షలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో విజయవాడ డివిజన్‌లోని టికెట్ చెకింగ్ సిబ్బందికి సోమవారం గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టికెట్ చెకింగ్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఈ శిబిరంలో నిర్వహించిన స్క్రీనింగ్ ప్రక్రియలో అవాంఛనీయ లక్షణాలను ముందుగానే గుర్తించి రాబోయే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ శిబిరం 1, 6-7 ప్లాట్‌ఫామ్‌లలోని ఆంధ్ర హాస్పిటల్ ఎమర్జెన్సీ సెంటర్‌లో 7 రోజుల పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేస్తుందన్నారు. శిబిరాన్ని రైల్వే సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 71 మంది టికెట్ చెకింగ్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.